
జర్నలో మలేరియా బాధితులను పరామర్శిస్తున్న రామనాథరావు

మలేరియాకు చికిత్స ఎలా అందుతోంది?

- బాధితులతో మాట్లాడిన డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు
- ప్రతి కేసుకూ చికిత్స అందించాలని అధికారులకు ఆదేశం
- జిల్లాలో వివిధ పీహెచ్‌సీల తనిఖీ

గుమ్మలక్ష్మీపురం/కురుపాం, మే 23 (ఆంధ్రజ్యోతి): మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు శుక్రవారం జిల్లాలో పర్యటించారు. పలు పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. మలేరియా బాధితులను పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. చికిత్స ఎలా అందుతుంది, సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగితెలుసుకున్నారు. తొలుత గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జర్న గ్రామంలో పర్యటించారు. మలేరియా బాధితులను కలిసి వారికి క్షేత్రస్థాయిలో అందిస్తున్న చికిత్స గురించి ఆరా తీశారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుడ్డుఖల్లు పీహెచ్‌సీ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. జ్వరాల అదుపు కోసం తీసుకుంటున్న చర్యల గురించి వైద్యాధికారి ప్రవీణ్‌తో చర్చించారు. తరువాత రేగిడి పీహెచ్‌సీ పరిధిలోని పెంగువ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ దోమల లార్వా ప్రదేశాలను గమనించారు. సిబ్బందికి ఫ్రైడే డ్రైడే ప్రాధాన్యతను వివరించారు. అలాగే కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మలేరియా కేసులకు అందుతున్న సేవలు గురించి డాక్టర్ మౌనిక అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలో ప్రతి మలేరియా కేసుకూ చికిత్స జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మణి, సహాయ అధికారి సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి కె. రాధాకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జల్‌జీవన్ పనులు పూర్తయ్యేనా?

ముంచుకొస్తున్న గడువు

- ఇప్పటికీ పూర్తికాని ట్యాంకుల నిర్మాణం
- వంశధారలో ఊటబావుల తవ్వకానికి ఆటంకాలు


సింగిడి వద్ద వంశధార నదీ గర్భంలో యంత్రాలతో చేపడుతున్న పనులు


పసుకుడి కొండపైన నత్తనడకన ట్యాంక్ పనులు

భామిని, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న జలజీవన్‌మిషన్ పనులు భామిని మండలంలో నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తున్నాయి. చేసిన పనులకు సకాలంలో బిల్లులు కూడా అందిస్తున్నాయి. అయినా, పనులు మాత్రం వేగవంతంగా జరగడం లేదు. మండలంలో అన్ని గ్రామాలకు జల్‌జీవన్ పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది రూ.60 కోట్లు మంజూరు చేసింది. ఈ ఏడాది జూన్ 15లోగా పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గత ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 72 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయాల్సి ఉంది. 54 గ్రామాలకు సంబంధించి 45 వాటర్ ట్యాంక్‌లను నిర్మించి, వాటి ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉంది. సింగిడి గ్రామ సమీపంలో వంశధార నది వద్ద పసుకుడి కొండపైన 90 టన్నుల లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్ ట్యాంక్ ఏర్పాటు చేసి బత్తిలి నుంచి కొరమ వరకు పైపులైన్ ద్వారా తాగునీటిని అందించాల్సి ఉంది. అయితే, కాంట్రాక్టర్ అలసత్వంతో ఈ పనులు గడువులోగా పూర్తికాని పరిస్థితి నెలకొంది. గత ఏడాది వర్షాకాలంలో పైపులైన్ల (మిగతా 8వ పేజీలో..)


సింగిడి వద్ద బావి పనులు ఇలా..

పడిపోతున్నా పట్టించుకోరా?

- పొలాల్లోకి ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు
- పొంచివున్న ప్రమాదం.. ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

8



జూన్ 10 నాటికి ఇళ్లు పూర్తి చేయాలి

- గృహ నిర్మాణ సంస్థ జీఎం వెంకటరమణ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ జీఎం వెంకటరమణ

పార్వతీపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం నిర్మిస్తున్న గృహాలన్నీ జూన్ 10 నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ జీఎం, ఉత్తరాంధ్ర జిల్లాల హౌసింగ్ ప్రత్యేకాధికారి వెంకటరమణ ఇంజనీర్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 10 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల గృహాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, స్టీల్, ఇతర సామగ్రికి కొరత లేదన్నారు. నీటి సౌలభ్యం లేకపోతే వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులను ఉత్తేజపరిచి ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయని, ఇటువంటి తరుణంలో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్, హౌసింగ్ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జీఎం వెంకటరమణ లబ్ధిదారులకు సూచించారు. పార్వతీపురం మండలం నరిసిపురం లేఅవుట్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. అక్కడి లబ్ధిదారులతో కాసేపు ముచ్చటించారు. నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని అన్నారు.

ఒకవైపే నీడ.. మరోవైపు ఎండ

- కొన్నిచోట్ల మాత్రమే గ్రీన్‌నెట్ ఏర్పాటు
- మిగిలిన ప్రాంతాల్లో వాహనదారులకు ఇక్కట్లు

6



వాగ్వాదాలు.. వివాదాలు

రసాభాసగా పార్వతీపురం మునిసిపల్ సమావేశం


వాగ్వాదం చేసుకుంటున్న కౌన్సిలర్లు సుధీర్, రవికుమార్

- వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం
- మధ్యలో వెళ్లిపోయిన చైర్‌పర్సన్ గౌరీశ్వరి
- కార్యాలయం వద్ద వైసీపీ సభ్యుల ధర్నా
- పట్టణాభివృద్ధికి వైసీపీ అడ్డుగా నిలుస్తుందని టీడీపీ సభ్యుల నిరసన

పార్వతీపురంటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మునిసిపల్ బడ్జెట్ సమావేశం రసాభాసగా మారింది. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదాలు, వివాదాలు చోటుచేసుకున్నాయి. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని శాంతింపజేశారు. అయితే, పోలీసులు తమ సభ్యుడిని బయటకు తీసుకెళ్లడంపై చైర్‌పర్సన్‌తో పాటు వైసీపీ కౌన్సిలర్లు సమావేశాన్ని వాకౌట్ చేసి బయటకు వచ్చేసి ధర్నా చేశారు. వీరు తీరుని తప్పుబడుతూ టీడీపీ కౌన్సిలర్లు నిరసన చేపట్టారు.

ఏం జరిగిందంటే..

గత మూడు నెలలుగా వాయిదా పడుతూ వస్తున్న మునిసిపల్ ప్రత్యేక, అత్యవసర (సాధారణ) సమావేశాలు చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన శుక్రవారం ప్రారంభమయ్యాయి. చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు బడ్జెట్ సమావేశానికి సంబంధించిన అజెండాలోని అంశాలను వివరిస్తున్న సమయంలో 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మంత్రి రవికుమార్, 25వ వార్డు వైసీపీ కౌన్సిలర్ ఎన్.సుధీర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమావేశం రసాభాసగా మారింది. పరిస్థితి అదుపుతప్పడంతో పట్టణ సీఐ మురళీధర్ మునిసిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలోకి వచ్చి ఇద్దరి కౌన్సిలర్లను శాంతింపజేశారు. బడ్జెట్ సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికి మళ్లీ ఈ ఇద్దరి కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరుకుంది. రౌడీషీటర్లను పాలకవర్గ సభ్యులుగా కొనసాగించడం ఎంత వరకు సమంజసమని కౌన్సిలర్ రవికుమార్ అనడంతో సమావేశ మందిరం వేడెక్కింది. దీంతో సీఐతో పాటు పట్టణ ఎస్‌ఐ గోవిందరావు, సిబ్బంది వైసీపీ కౌన్సిలర్ సుధీర్‌ను సమావేశమందిరం నుంచి బయటకు తీసుకువచ్చారు. ఈ సమయంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కనీసం స్పందించలేదని చెప్పి చైర్‌పర్సన్ గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ ఐ.గున్నేష్‌తో పాటు వైసీపీ కౌన్సిలర్లు సమావేశాన్ని వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. తమను అవమానించడం తగదంటూ మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కమిషనర్ వెంకటేశ్వర్లను వెంటనే బదిలీ లేదా, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. బాధ్యతయుతమైన పదవిలో ఉన్న చైర్‌పర్సన్ సమావేశాలు పూర్తికాకుండా బయటకు వెళ్లిపోవడం సరికాదని విమర్శించారు.

టీడీపీ నిరసన..

పట్టణాభివృద్ధికి వైసీపీ పాలకవర్గ సభ్యులు ఆటంకంగా మారారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆయన ఆధ్వర్యంలో టీడీపీ సభ్యులు మునిసిపల్ (మిగతా 8వ పేజీలో..)


మునిసిపల్ కార్యాలయం బయట ధర్నా చేస్తున్న వైసీపీ సభ్యులు


ఎమ్మెల్యే విజయచంద్ర ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న టీడీపీ సభ్యులు

రేషన్ పంపిణీ బాధ్యత మళ్లీ గిరిజన సహకార సంస్థకే

- ఏజెన్సీ ప్రాంతాల్లో సరుకులు అందించనున్న జీసీసీ
- జిల్లాలో 150 డీఆర్ డిపోలు

గుమ్మలక్ష్మీపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో రేషన్ పంపిణీ బాధ్యతను మళ్లీ గిరిజన సహకార సంస్థ(జీసీసీ)కే అప్పగించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (రేషన్ వాహనాలు) వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో గిరిజన గ్రామాల్లో రేషన్ పంపిణీ బాధ్యతను జీసీసీ డీఆర్ డిపోలకు అప్పగించారు. జూన్ నుంచి రేషన్‌కార్డుదారులు పాతపద్ధతిలో డీఆర్ డిపోలకు వెళ్లి రేషన్ తీసుకోవాల్సి ఉంది. పార్వతీపురం డివిజన్ పరిధిలో గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురంలో జీసీసీ బ్రాంచ్‌లు ఉన్నాయి. ఈ బ్రాంచ్‌ల పరిధిలో సుమారు 150 వరకు డీఆర్ డిపోలు ఉన్నాయి. ఈ డిపోల్లోని సేల్స్‌మెన్ల ద్వారా నిత్యావసర సరుకులతో పాటు రేషన్ పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో డీఆర్ డిపోల ద్వారా గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, మక్కువ, సాలూరు, పాచిపెంట, సీతంపేట, మండల్లాలోని గిరిజనులకు రేషన్ సరుకులు ఇచ్చేవారు. వీటితో పాటుగా నిత్యావసరాల అమ్మకాల బాధ్యత, అటవీ ఫలసాయాలు కొనుగోలు డీఆర్ డిపోల ద్వారా నిర్వహించేవారు. అయితే, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత డీఆర్ డిపోలు నిర్వీర్యమయ్యాయి. ఎలాంటి కార్యకలాపాలు జరగకపోవడంతో డిపోల భవనాలు మరమ్మతులకు గురయ్యాయి. కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఈ డిపోల ద్వారా రేషన్ ఇవ్వనందున ఆ భవనాలను బాగు చేయాల్సిన అవసరం ఉంది.



లేదంటే ఇబ్బందులు తప్పవు. ఈవిషయమై గుమ్మలక్ష్మీపురం జీసీసీ మేనేజర్ ఎస్.రామును వివరణ కోరగా.. 'జూన్ 1 నుంచి డీఆర్ డిపోల ద్వారా రేషన్ పంపిణీ చేస్తాం. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాట్లు చేస్తున్నాం'.అని తెలిపారు.

పార్కు అభివృద్ధికి చర్యలు

- ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ

గరుగుబిల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని సుంకి ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఐటీడీఏ పార్కు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఈ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యాటకులను ఆకర్షించే విధంగా పార్కును సుందరీకరణ చేయాలని సూచించారు. పార్కుకు అనుకుని ఉన్న షాపుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే తోటపల్లి ప్రాజెక్టు ప్రాంతంలో బోటు షికారును ప్రారంభించేందుకు దృష్టి సారించాలన్నారు. నదీ ప్రాంతంలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి బోటు షికారుకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఐటీడీఏ ఏఈ జి.తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న పీవో

అమ్మో.. పాము



- జిల్లాలో విష సర్పాల స్వైరవిహారం
- వాతావరణం మారడంతో బయటకు వస్తున్న వైనం
- రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం

రాజాం, మే 23 (ఆంధ్రజ్యోతి)

వర్షాలు మొదలయ్యాయి. విషసర్పాలు బయట సంచరించడం అధికమైంది. దీంతో జిల్లాలో పాముకాటు బాధితులు పెరుగుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితులతో విషసర్పాలు బయటకు వస్తున్నాయి. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులను కాటు వేస్తున్నాయి. విజయనగరం మహారాజా ఆస్పత్రికి వారానికి సగటున 6 నుంచి 10 వరకూ పాము కాటు కేసులు వస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. ఇంకోవైపు అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో పాములు, తేళ్లు, జెర్రిలు బయటకు వచ్చి కాటు వేస్తున్నాయి. గత ఏడాది జిల్లాలో 700 మంది పాముకాట్లకు గురైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయాధారిత జిల్లా కావడం, నదులు, కాలువలు ఎక్కువగా ఉండడంతో పాముల విహారానికి అవకాశం ఎక్కువగా ఉంది. సాధారణంగా వర్షాకాలంలో చిత్తడి నెలలో పాముల విహారం అధికంగా ఉంటుంది. రైతులు వ్యవసాయ పనుల్లో నిగ్నమైనప్పుడు కాటు వేస్తున్నాయి. దీంతో రైతులు ఎక్కువగా మూల్యం చెల్లించుకుంటున్నారు. ప్రధానంగా 60 రకాల విష సర్పాలు ఉన్నాయి. కానీ జిల్లాలో తాచుపాము, కట్లపాము, రక్తపింజరి, చంద్రపొడ తదితర పాముల సంచారం అధికం. ముఖ్యంగా కొండ, అటవీ, మైదాన ప్రాంతాల్లో వీటి సంచారం ఎక్కువగా ఉంటోంది.

● వైద్యం అందక.. మూల్యం

పాముకాటు వేసిన వెంటనే తగిన సమయంలో వైద్యసేవలందక ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అంతేకాక బాధితుల్లో 70 శాతం మంది నాటు వైద్యంపై ఆధారపడుతున్నారు. ప్రాణాలు కాపాడే విలువైన సమయాన్ని చేజేతులా జారవిడుస్తున్నారు. పాముకాటుకు విరుగుడుగా ఇచ్చే 'పాలీవేలెంట్ యాంటీవీనమ్' శాస్త్రీయంగా నిరూపితమైన మందు. కొన్నిరకాల సర్పాల నుంచి సేకరించిన విషంతో దీనిని తయారుచేస్తారు. మనదేశంలో యాంటీవీనమ్ తయారవుతున్నా.. అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

● గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం..

జిల్లాలో అధిక శాతం పాముకాటు మరణాలు గ్రామీణ ప్రాంతాల్లోనే సంభవిస్తున్నాయి. అయితే స్థానికంగా ఉండే పీహెచ్‌సీల్లో యాంటీ వీనమ్ అందుబాటులో ఉంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటిస్తోంది. కానీ చాలా పీహెచ్‌సీల్లో ఉండడం లేదన్న విమర్శ ఉంది. సీహెచ్‌సీలతో పాటు ఏరియా ఆస్పత్రిల్లో యాంటీవీనమ్ అందుబాటులో ఉన్నప్పటికీ..అది మొదటి 5-10 డోసులకే పరిమితమవుతోంది. తరువాత బాధితులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాల్సి వస్తోంది. చికిత్స ఆలస్యం కావడం, విషం తీవ్రత బట్టి డోసుల మోతాదు మారుతూ ఉంటుంది.



● పూర్తిస్థాయిలో మందు అందక..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరానికి తగ్గట్టు యాంటీ వీనమ్ మందులు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు పాముకాటు బాధితులు ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటున్నప్పటికీ పూర్తి స్థాయి డోసులు పడక దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా పక్షవాతం, మెదడులో రక్తం గడ్డకట్టడం, అంధత్వం తలెత్తడం, నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు గుండె, కాలెయం పనితీరుపై ప్రభావం చూపే రుగ్మతలకు గురికావడం వంటివి జరుగుతున్నాయి. పాముకాటుకు గురైన బాధితుడికి మూడుగంటలలోపు శరీరంలో విష తీవ్రతను బట్టి యాంటీ వీనమ్ డోసులను అందించగలిగితే ప్రాణాలు కాపాడుకోవచ్చు. ఆపై దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. జిల్లాలో 60 పీహెచ్‌సీలతో పాటు 104 వాహనాలు 55 ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి. వీటిలో పూర్తిస్థాయిలో యాంటీవీనమ్ మందును అంబాటులో ఉంచితే పాముకాటు మృతుల సంఖ్యను తగ్గించవచ్చు.

● ఇవి చేయాలి

● పాముకాటు బారినపడకుండా ఉండాలంటే వాటి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ● ఇంటి పరిసరాల్లో వస్తువులు, ధాన్యం రాశులు, సంచులు తదితర వాటిలో మురుగు లేకుండా చూసుకోవాలి. ● పిల్లలను పుట్టలు, గుట్టలు దగ్గర ఆటలు ఆడకుండా చూసుకోవాలి. ● రాత్రి సమయంలో టార్చిలైట్ల వెలుతురులో బయటకు వెళ్లాలి. ● రైతులు తమ శాలల్లో పశువులను కట్టినప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ● పొలాలకు వెళ్లినప్పుడు చేతిలో కర్రతో పాటు వినికిడి శబ్దాలు చేసే పరికరాలు తమ వద్ద ఉంచుకోవాలి. ● రాత్రి, తెల్లవారుజాము సమయంలో పొలాలకు వెళ్లే వారు విధిగా తమ వెంట టార్చిలైట్లు అందుబాటులో ఉంచుకోవాలి. ● మట్టి, పెంకుటిళ్లకు ఎక్కడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలి.

● అప్రమత్తంగా ఉండాలి..

పాముకాటు వేస్తే వెంటనే యాంటీవీనమ్ డోసు వేయాలి. తక్షణం ఆస్పత్రులకు తీసుకెళ్లాలి. నాటు వైద్యం అత్యంత ప్రమాదకరం. ఆలస్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. అన్నింటికీ మించి బాధితుడు ధైర్యంగా ఉండాలి. పాముకాటు వేసిన వెంటనే విష ప్రసారం జరగకుండా అడ్డుకట్ట వేయాలి. తాడుతో గాయాన్ని కట్టి వేయాలి. పాముకాటు వేసిన మూడు గంటల్లో ఇంజక్షన్ అందిస్తే ప్రాణాపాయం ఉండదు. ప్రభుత్వాస్పత్రిలో యాంటీ వీనమ్ డోసులు అందుబాటులో ఉంటాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

-కరణం హరిబాబు, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రాజాం

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

● ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ

కురుపాం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. కురుపాం మండలంలోని నేరుడవలస, తోటగూడ గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. వివిధ దశలో ఉన్న పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను పరిశీలించారు. గృహ నిర్మాణాల జాప్యానికి గల కారణాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గృహ నిర్మాణ సామగ్రిని అందుబాటులో ఉంచకోవాలన్నారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, ట్రైబుల్ వెల్ఫేర్ డీఈఈ చాణుక్య, హౌసింగ్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఫాంపాండ్స్‌పై దృష్టి సారించండి

● డ్వామా పీడీ రామచంద్రరావు

సీతంపేట రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న ఫాంపాండ్స్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ రామచంద్రరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాంపాండ్స్ లక్ష్యాలను ఈనెల 31వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది కూడా ఆ దిశగా పనులు వేగవంతం చేయాలని సూచించారు. లక్ష్యాలను పూర్తిచేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బీబీ మిశ్రో, ఏపీడీ శ్రీహరి, ఏపీవో సాగర్‌లతో పాటు భామిని, సీతంపేట మండలాలకు చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎఫ్ఏ, టీఏ, ఈసీలు పాల్గొన్నారు.

అయినా.. వారు మారలేదు

- పరిష్కారం కాని అర్జీలు ● ఎక్కడి సమస్యలు అక్కడే
- ఇదీ రెవెన్యూ అధికారుల తీరు
- కలెక్టర్ సమీక్షలో బట్టబయలు

శృంగవరపుకోట, మే 23 (ఆంధ్రజ్యోతి)

● ప్రభుత్వ భూముల్లో నిర్మించిన గృహాల క్రమబద్ధీకరణకు వేపాడ తహసీల్దార్ కార్యాలయానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.

● పట్టణ రూపురేఖలు ఉన్న కొత్తవలస మండలంలో కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే అందాయి.

...వీటిని క్రమబద్ధీకరించేందుకు భూ పరిపాలన శాఖ (సీసీఎల్ఏ) ఈ ఏడాది జనవరి 29న జీవో ఎంఎస్ నెంబర్ 30తో ఉత్తర్వులను జారీ చేసిన సంగతి తెలిసిందే. దీని అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. 150 గజాల వరకు ఉన్న నిర్మాణం ఉచితం. అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న నిర్మాణాలకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించాలి. పట్టాలను మాత్రం మహిళల పేరున అందించనున్నారు. 2019 అక్టోబరు 15 కంటే ముందు భూములను ఆక్రమించి నిర్మాణాలను చేపట్టిన వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కానీ దీనికి వివిధ ప్రాంతాల్లో ఆశించిన స్పందన కనిపించడం లేదు. రెవెన్యూ అధికారులు సరిగా దృష్టి పెట్టకపోవడమే కారణమని కలెక్టర్ అంబేడ్కర్ నిర్వహించిన సమీక్షలో వెల్లడైంది. అధికారులు ఎంతగా చెబుతున్నా రెవెన్యూ అధికారుల తీరు మాత్రం మారడం లేదు.

ఆ శాఖపైనే అధిక ఫిర్యాదులు..

జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలపై అత్యధికంగా పిర్యాదులు వస్తున్నాయి. మండల స్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్, సీఎంవో కార్యాలయాలను సంప్రదిస్తున్నారు. దీంతో మండల స్థాయి రెవెన్యూ అధికారుల పనితీరును మెరుగుపరిచేందుకు కలెక్టర్ రెండు రోజుల పాటు నియోజకవర్గాల వారీగా క్షేత్ర స్థాయిలో సమీక్షలు నిర్వహించారు. వెనుకబడిన అధికారులను నిలదీయడంతో పాటు వారిపై కలెక్టర్ అంబేడ్కర్ మండిపడ్డారు. ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాల క్రమబద్ధీకరణ, ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల స్వీకరణ, ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్, ఆన్‌లైన్ పెండింగ్ సర్వీస్, రీసర్వే, పీజీఆర్ఎస్ ఇలా వివిధ అంశాలపై చేపట్టిన చర్చలో రెవెన్యూ అధికారుల పనితీరు తేటతెల్లమైంది. క్షేత్ర స్థాయిలో వినతులు పరిష్కారం కాలేదని గుర్తించారు. నాలుగు నెలల క్రితం ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ జీవో



కలెక్టర్ అంబేడ్కర్

వచ్చింది. ఈ విషయం క్షేత్ర స్థాయికి వెళ్లలేదు. రెవెన్యూ అధికారులు ప్రచారం చేయలేదు. కనీసం గ్రామాల్లో ఉన్న ఆక్రమిత భూముల వివరాలను నమోదు చేయలేదు.



ఎస్.కోటలో జరిగిన సమీక్ష సమావేశానికి హాజరైన రెవెన్యూ అధికారులు, సిబ్బంది

పొంతన లేని లెక్కలు..

అందరికీ ఇళ్ల పథకం కింద వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయలేదు. వైసీపీ ప్రభుత్వం అనర్హులకు ఇళ్ల స్థల పట్టాలు అందించింది. వీటిని కొందరు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. కొంతమంది వైసీపీ నేతలు బినామీ పేర్లతో పట్టాలను సొంతం చేసుకున్నారు. ఇది అందరికీ తెలిసిందే. కానీ రెవెన్యూ అధికారులకు మాత్రం కనిపించడం లేదు. కాకి లెక్కలు చూపిస్తున్నారు. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం రీ వేరిఫికేషన్ చేయిస్తోంది. కొన్ని మండలాల్లో ఒకటి నుంచి పది మంది వరకు అనర్హులు ఉన్నారని చూపించి చేతులు దులుపుకున్నారు. మరి కొన్ని మండలాల్లో అందరికీ అర్హత ఉన్నట్టుగా చూపించారు. కలెక్టర్‌కు పంపించిన నివేదికలు చూస్తే ఔరా అనిపించక తప్పదు.

తప్పుల తడకలు..

గత వైసీపీ ప్రభుత్వం భూముల రీసర్వే చేయించింది. 502 గ్రామాల్లో భూములను రీ సర్వే చేశారు. సర్వే నెంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) నెంబర్లను నమోదు చేశారు. ఐదు నుంచి పది మంది వరకు ఒకే ఎల్‌పీఎం నెంబర్‌ను కేటాయించారు. ఇప్పుడు ఈ నెంబర్ వల్ల భూముల క్రయ, విక్రయాలతో పాటు అన్నదాత సుఖీభవ పథకం నమోదుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోర్టల్‌లో ఒక రైతు పేరును నమోదు చేస్తే ఎల్‌పీఎం నెంబర్‌లో మరో పేరుతో భూముల విస్తీర్ణం కనిపిస్తోంది. పీజీఆర్ఆస్ వినతులకు మెక్కుబడి పరిష్కారం చూపుతున్నారు. ప్రజా ప్రతినిధులు, నేతల మాటలను ఖాతరు చేయడం లేదు. ప్రభుత్వం వినతుల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకుంటోంది. వారు సంతృప్తి చెందకపోయినా సంతృప్తి చెందినట్లు అధికారులు నివేదికలు పంపుతున్నారు. కొన్ని మండలాల్లో ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకోవడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలా గురు, శుక్రవారాల్లో కలెక్టర్ చేపట్టిన సమీక్ష సందర్భంగా అనేక లోపాలు బయటికి వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి.

చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న న్యాయాధికారులు శారదాంబ, నైమిష

● సీనియర్ న్యాయాధికారి శారదాంబ

రాజాం రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మహిళల కోసం అమలు చేస్తున్న చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. చట్టాలకు లోబడి ప్రతిఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. ఇక్కడి కోర్టు సముదాయ ప్రాంగణంలో సంతకవిటి మండలంలోని అన్ని సచివాలయ, గ్రామ మహిళా కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో న్యాయాధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ చట్టాలు, గృహహింస నుంచి మహిళలకు రక్షణ, భరణం, పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాల నిరోధక చట్టం, 14 ఏళ్ల లోపు చిన్నారుల నిర్బంధ ప్రాథమిక విద్య తదితర అంశాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో పనిచేసే వారికి మహిళా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వాటిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని న్యాయాధికారి స్పష్టం చేశారు. అంతకుమందు కోర్టు సముదాయ ప్రాంగణంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో జడ్జి శారదాంబ సమావేశమయ్యారు. పారా లీగల్ వలంటీర్లు అనుసరించాల్సిన విధి,విధానాలను గుర్తు చేశారు. న్యాయ సంస్థల సేవలను ప్రజలకు వివరించాలని న్యాయాధికారి సూచించారు. ఈ కార్యక్రమాలలో జూనియర్ సివిల్ జడ్జి నైమిష తదితరులు పాల్గొన్నారు.

ఎండైనా... వానైనా.. ఆ రోడ్డే ఆధారం!

గజపతినగరం, మే 23: (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో రోడ్డు పొడవునా ఓ పక్కన నిలుచున్న జనాన్ని చూశారా? వారంతా ఏ వింతను చూడడానికో... ఏ ఊరేగింపును తిలకించడానికో ఇలా బారులు తీరారని అనుకుంటున్నారా? కానే కాదు. వారంతా బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు. గజపతి నగరంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఇలా బస్సులు, ఆటోల కోసం వేచి ఉంటారు. ఎండైనా.. వానైనా.. వరదలొచ్చినా.. బస్సుల కోసం ప్రయాణికులు ఇలా రోడ్డు పక్కన నిలుచోవలసిందే. దీనికి ప్రధాన కారణం అక్కడ బస్సు షెల్టర్ లేకపోవడమే. ఎన్నో ఏళ్లగా ప్రయాణికులకు ఈ రోడ్డే బస్ షెల్టర్. వేసవిలో ఎండలకు ఎండుతూ... వర్షాకాలంలో వానలకు తడుస్తూ... గమ్యస్థానాలకు చేరుకోవడానికి అక్కడ అలా గంటల తరబడి వేచి ఉంటారు. ఎంతోమంది అధికారులకు బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతులు ఇచ్చినా ఫలితం లేకపోతోందని ప్రయాణికులు వాపోతున్నారు. గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు మండలాలకు చెందిన వందలాది మంది ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం ఈ నాలుగు రోడ్ల కూడలిలో వేచి ఉంటుంటారు. ఈ జంక్షన్ వద్ద బస్సులతోపాటు ప్రైవేటు వాహనాలు ఆగుతుంటాయి. దీంతో కష్టమైనా అక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు వెళతారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నాలుగు రోడ్ల కూడలిలో బస్సు షెల్టర్‌ను నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.



ఎండలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఒకవైపే నీడ.. మరోవైపు ఎండ

- కొన్నిచోట్ల మాత్రమే గ్రీన్‌నెట్లు ఏర్పాటు
- మిగిలిన ప్రాంతాల్లో వాహనదారులకు ఇక్కట్లు



అంబేడ్కర్ కూడలిలో ఒక వైపు ఏర్పాటు చేసిన నెట్

విజయనగరం రింగురోడ్డు, మే 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి, మయూరి కూడలి, ఎత్తు బ్రిడ్జి, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పడే సమయంలో వాహనదారులు ఎండలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వీరికి ఉపశమనం కలిగించేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బీట్ ది హీట్ పేరిట గ్రీన్‌షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అంబేడ్కర్ కూడలి, మయూరి కూడలిలో వీటిని ఏర్పాటు చేశారు. కానీ కేవలం ఒకవైపు మాత్రమే వీటిని ఏర్పాటు చేశారు. మిగిలిన వైపుల నెట్‌లు ఏర్పాటు చేయలేదు. అంతేకాదు... కేవలం ఈ రెండు జంక్షన్లకే పరిమితం చేశారు. మిగిలిన జంక్షన్‌లలో ఇవి లేకపోవడంతో వాహనదారులు ఎండలో ఇబ్బందులు పడుతున్నారు. వీటి వల్ల సిగ్నల్స్ దగ్గర ఆగినప్పుడు కాస్త ఉప శమనం కలుగుతోందని... దీన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని జంక్షన్లలో పూర్తి స్థాయిలో నెట్‌లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



మరోవైపు ఎండలో వాహనదారులు

పశు వైద్యశాలను పట్టించుకోరా..?

●30 ఏళ్లనాటి భవనానికి కనీస మరమ్మతులు కరువు● సిబ్బంది, రైతులకు తప్పని ఇక్కట్లు

మెరకముడిదాం, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భాం ప్రభుత్వ పశు వైద్యశాల శిథిలావస్థకు చేరింది. చాన్నాళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఈ భవనాన్ని దాదాపు 30 ఏళ్ల కిందట నిర్మించారు. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రూపు కోల్పోయింది. చిన్నపాటి వర్షం కురిసినా వైద్యశాల యావత్తూ జలమయంగా మారుతుంది. దాంతో సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం. ఈ వైద్యశాల పరిధిలో సుమారు 9 పంచాయతీలు ఉన్నాయి. నిత్యం అధిక సంఖ్యలో రైతులు పశువులను వైద్యం నిమిత్తం ఇక్కడకు తీసుకు వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పశు వైద్యశాల అభివృద్ధికి కనీస చర్యలు చేపట్టని తీరుపై రైతులు అసంతృప్తి చెందుతున్నారు. పశు సంవర్ధక శాఖకు ఏటా ప్రభుత్వం లక్షలాది రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ స్థానిక వైద్యశాల అభివృద్ధికి కనీస చర్యలు చేపట్టని దుస్థితి ఇక్కడ నెలకొంది. దీంతో ఇటు సిబ్బంది అటు రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.



శిథిలావస్థకు చేరిన గర్భాం పశు వైద్యశాల ఇదే..

ఉద్యోగ భద్రత కల్పించండి

వేపాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థ రద్దు నిర్ణయంపై ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ జె.రాములమ్మకు వారు వినతి పత్రం అంద జేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా తతాము పౌర సర ఫరాల శాఖలో భాగమై ప్రజలకు రేషన్ సరకులు పంపిణీ చేశామన్నారు. ప్ర భుత్వ నిర్ణయంతో రోడ్డునపడ్డామన్నారు. మా ఇబ్బం దులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

●మక్కువ: రెండేళ్ల అగ్రిమెంట్ ఉన్నప్పటికీ మధ్యంతరంగా ఎండీయూ వ్యవస్థ రద్దు కారణంగా ఉపాధి కోల్పోయిన తమను ఆదు కోవాలని ఆపరేటర్లు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ షేక్ ఇబ్రహీంకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆపరేట ర్లు ఎం.నరేష్, శివ, క్రాంతి పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని పాదయాత్ర

పాచిపెంట, మే 23 (ఆంధ్రజ్యోతి): కుడు మూరు సర్వే నెం.48లో గిరిజనుల సాగులో ఉన్న 782 ఎకరాలకు పట్టాలు మంజూరు చే యాలని ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవ సాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కుడుమూరు లో పోరాట పాదయాత్ర ప్రారంభించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.వె.నాయుడు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా సాగు చేసుకుంటున్న ఈ భూములకు పట్టాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికపై సర్వేలు జరిపి డిపట్టా మంజూరు చేయాలని, లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 25 వరకు పాద యాత్రలు కొనసాగుతాయన్నారు. కార్యక్ర మంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సూకురు అప్పలస్వామి తదిత రులు పాల్గొన్నారు.

గరిష్ట వేతనం పొందండి

మక్కువ, మే 23 (ఆంధ్రజ్యోతి): వేతన దారులు గరిష్ఠ వేతనం పొందేలా పనులు చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.శ్యామల సూచించారు. కొయ్యానపేట బడే చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఆమె శుక్ర వారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనదారులు పనివేళలు సక్ర మంగా పాటించాలన్నారు. మస్తర్లలో తేడా వ స్తే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరిం చారు. ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ ఉన్నారు.

మహానాడు విజయవంతం చేద్దాం

రాజాం, మే 23 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు విజయవంతానికి కృషి చేద్దామని సీనియర్ టీడీపీ నాయుకులు కోండ్రు జగదీశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్యాంపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన నాయుకులతో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా జగదీశ్ మాట్లాడుతూ ప్రతీ వార్డు, గ్రా మం నుంచి భారీస్థాయిలో కార్యకర్తలు, అభి మానులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాల న్నారు. సమావేశంలో టీడీపీ టీడీపీ అధ్యక్షు డు నంది సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.రమేశ్‌కుమార్. పిల్లా సత్యంనాయుడు, బెహరా తవుడు, గ్రంధి గోపి, సూరిబాబు, రవి తదితరులున్నారు.

25న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ

రాజాం, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంఆర్ ఐటీలో ఈనెల 25న నిర్వహిం చనున్న రాష్ట్రస్థాయి ఓపెన్ చదరంగం పోటీ లను విజయవంతం చేయాలని ఆల్ ఇండి యా చెస్ ఇన్ స్కూల్ ట్రైనర్ సనపల భీమా రావు ప్రకటనలో కోరారు. పోటీలలో గెలు పొందిన విజేతలకు రూ.1.30 లక్షల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. పోటీలకు వివి ధ జిల్లాల నుంచి 150 మంది ఇంటర్నేషనల్ రేటెడ్ క్రీడాకారులు, అన్ రేటెడ్ క్రీడాకారులు హాజరు కానున్నారన్నారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు 9912559735 నెంబరును సంప్ర దించాలన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కళావెంకటరావు

గుర్ల, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్, పిల్లా అప్పల నాయుడు, కిలారి సూర్యనారాయణ, దాసరి శివప్రసాద్, కనిమెరక కృష్ణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కుంభకోణాల పార్టీని ప్రజలు నమ్మరు

గుర్ల, మే 23(ఆంధ్రజ్యోతి): కుంభకోణాలకు పాల్పడే పార్టీని ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం మండలంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాభివృద్ధి నిలిచి పోయిందన్నారు. మహిళలకు అన్ని విధాలుగా చే యూత అందించేందుకు చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి నాయుడు, టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కిరణ్‌కుమార్, నాయకులు సీహెచ్.మహేశ్వరరావు, అప్పలనాయుడు, సూర్య నారాయణ, గోవింద్, సన్యాసి నాయుడు, దాసరి శివప్రసాద్, చిట్టి రాజు, తహసీల్దారు ఆదిలక్ష్మి, ఎంపీడీవో శేష బాబు, సీడీపీవో అరుద్ర, పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు సక్రమంగా చేపట్టాలి



వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

భోగాపురం, మే23(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను సక్రమంగా చేపట్టాలని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం భోగాపురం, చాకివలస గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను సరిచూశారు. పనుల కొలతలు, రికార్డుల నమోదు పక్కాగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. రోజువారీ రూ.307 గిట్టుబాటు వేతనం సమకూరేలా పనులు చేయించాలన్నారు. ఫాంపాండ్స్ తవ్వకాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆమెతో పాటు ఏపీవో భాగ్యలక్ష్మి ఉన్నారు.

ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న బ్యాంక్ డైరెక్టర్ ఖండాపు

రాజాం రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకుల మాదిరిగా లాభార్జనే ధ్యేయంగా కాకుండా బ్యాంకు ఖాతాదారుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా బ్యాంకు పనిచేస్తోందని ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు ఖండాపు ప్రసాదరావు, ఆళ్ల రామకృష్ణారావు, పి.వి.నరసింహమూర్తి అన్నారు. ఖాతాదారులకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయంతో పాటు విద్య, వైద్య అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో బ్యాంకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రగతితో పాటు ఖాతాదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను డైరెక్టర్లు వేర్వేరుగా వివరించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని హైదరాబాద్, అమలాపురం, నూజివీడు, తెనాలి, విశాఖపట్నంలలో మరో ఐదు కొత్త శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు బ్యాంకు డైరెక్టర్లు ప్రకటించారు. సమావేశంలో బ్యాంకు జోనల్ మేనేజర్ శ్రీనివాసులు, రాజాం శాఖ మేనేజర్ సింహాద్రి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తరలింపుపై పునరాలోచించండి



నివేదికను విడుదల చేస్తున్న భీశెట్టి

విజయనగరం దాసన్నపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఉన్న చోటే కొనసాగించాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు సూచించిన నేపథ్యంలో ఆ నిర్ణయంపై ఆయన పునారాలోచన చేయాలని పౌర వేదిక జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శుక్రవారం నగరంలోని పౌర వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులు, వైద్యులు, సిబ్బంది వసతి చాలక ఇబ్బందులు పడుతుంటే, ఉన్నచోటే ఆసుపత్రిని కొనసాగించాలని మంత్రి ఎలా చెబుతారని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో న్యూరో, న్యూరో మెడిసిన్, న్యూరాలజీ, అంకాలజీతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రామచంద్రరాజు, రామ్మోహనరావు, లోగిశ రామకృష్ణ పాల్గొన్నారు.

కరోనా వైరస్‌పై ఆందోళన వద్దు

గజపతినగరం, మే23 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్ అ న్నారు. జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకే అవకాశం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం పీహెచ్‌సీలో సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. కరోనా వైరస్ సోకకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రజలు తప్పని సరిగా మాస్కులు ధరించాలన్నారు. చేతుల శుభ్రత తప్ప నిసరి అన్నారు. జలుబు, జ్వరం వంటి వ్యాధులు సోకితే తక్షణమే వైద్యుల సూచ నలు పాటించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందజేయాలని అనూజ్‌రాయ్ ఆదేశించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం రాత్రి తన క్యాంప్ కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలమంత్రి కొండపల్లి శ్రీనివాస్ పంపిణీ చేశారు. 15 మంది లబ్ధిదారులకు రూ.14,08,373 విలువైన చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో అందిన సమస్యలను సంబంధిత విభాగాల అధికారులకు పంపిస్తానన్నారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల నుంచి యూనిట్ ఇన్‌చార్జిలు నగర, మండల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోండి



మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట (కొత్తవలస), మే 23(ఆంధ్రజ్యోతి): విద్యావంతులైన యువకులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం కొత్తవలస ప్రగతి కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు ఆయన హాజరై మాట్లాడారు. నిర్వహించారు. మేళాలో 21 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మేళాకు 1242 మంది పాల్గొనగా అందులో 388 మందిని ఎంపిక చేసినట్టు నిర్వాహకుడు వి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్, ప్లేస్‌మెంట్ అధికారులు ఎ.అరుణ, టి.భాస్కర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు పూర్తి



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌లో రెండు ఉద్యోగాల భర్తీకి కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వన్ స్టాప్ సెంటర్‌లో పారా లీగల్ పర్సన్, మల్టీ పర్సన్ స్టాఫ్ కమ్ కుక్ పోస్టుల భర్తీకి ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించారు. పారా లీగల్ పర్సన్ పోస్టుకు ముగ్గురు, మల్టీ పర్సన్ స్టాఫ్‌కు 13 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కలెక్టరు అంబేడ్కర్ ఆదేశాల మేరకు ఇంటార్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూ బోర్డులో సివిల్ సప్లైస్ డీఎం శాంతి, డీపీవో టి.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో జీవనరాణి తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

విజయనగరం క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో మ ద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌ల యజమానులు నిబంధనలను విధిగా పాటించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీఎల్ బాబ్జీరావు హెచ్చరించారు. గురువారం రాత్రి విజయనగరం డివిజన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. అధి క ధరలకు మద్యం విక్రయించినా, సమయ పాలన పాటించకపోయినా కేసులు న మోదు చేస్తామన్నారు. టోల్ ఫ్రీ నెంబరు 14405కు కాల్ చేసినా స్పందించి చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

చిట్టిబాబుకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న చిట్టిబాబు

విజయనగరం, మే23 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు శుక్రవారం జాతీయ అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలోని ఇండియన్ హబిటేడ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ విధాన పరిషత్ సభ్యుడు, నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా వ్యవస్థాపకుడు భారతరత్న సి.సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డును ఆయన అందుకున్నారు. నేషనల్ క్యాంపెన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్ జాతీయ కార్యదర్శి బీనా పాలికల్, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ సత్యానంద్ మిశ్రా చేతుల మీదుగా అవార్డును ఆయన స్వీకరించారు.

వైసీపీ, జనసేన వర్గీయుల కొట్లాట

●ఐదుగురికి గాయాలు ●ఇరువర్గాలపై కేసుల నమోదు

నెల్లిమర్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో శుక్రవారం వైసీపీ, జనసేన వర్గీయుల మధ్య కొట్లాట జరిగింది. స్థానికంగా ఉన్న చెరువు నుంచి వైసీపీకి చెందిన సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు ట్రాక్టర్‌తో మట్టి తర లిస్తుండగా జనసేన వర్గీయులు ప్రశ్నించడమే ఈ కొట్లాటకు కారణంగా తెలుస్తోంది. కొట్లాటలో సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావుతో పాటు జనసేనకు చెందిన సువ్వాడ రమణ, గురాన గోవింద, కల్యాణపు లోకేశ్, పంచాది రమణ గాయపడ్డారు. సర్పంచ్ శ్రీనివాసరావు విజయనగరం సర్వజన ఆసుపత్రిలో, జనసేన వర్గీయులు నెల్లిమర్ల మిమ్స్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు వర్గాలపై కేసులు న మోదు చేసినట్టు ఎస్ఐ బి.గణేశ్ తెలిపారు. ఇదిలా ఉండగా కొట్లాట ఘటన లో గాయపడి మిమ్స్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనసేన వర్గీయులను ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరామర్శించారు. కొట్లాటకు గల కారణాలపై ఆరా తీశారు. ఆమెతో పాటు కరుమజ్జి గోవింద్ ఉన్నారు.

వ్యక్తికి గాయాలు

గంట్యాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ తామారాపల్లి కూ డలిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనాపురం గ్రామానికి చెందిన ఆర్.జగదీశ్ గాయపడ్డాడు. స్థానికులు అందించిన వివరాల మేరకు జగదీశ్ కొండ తామారాపల్లి కూడలి నుంచి మదనాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కూడలి దాటే సరికి రహదారిపై కుక్క అడ్డంగా రావ డంతో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జగదీశ్ తలకు బలమైన గాయమైంది. 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

తవిటి చెరువులో నిర్మాణాల అడ్డగింత



చెరువులో నిర్మిస్తున్న ప్రహరీ

లక్కవరపుకోట, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లివీడు రెవెన్యూలోని తవిటి చెరువులో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. ఇక్కడి చెరువును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేస్తుండటంతో ఆర్ఐ సన్యాసిరావు అక్కడకు చేరుకుని పనులు ఆపించారు. ఈ చెరువు విశాఖ-అరుకు హైవేకు విశాఖ కిరండోల్ రైల్వే లైన్‌కు ఆనుకుని ఉంది. దాంతో పక్కనున్న కర్మాగారాల యజమానులు, స్థానిక పెద్దల కళ్లు చెరువుపై పడ్డాయి. ఈ చెరువు మధ్యలో నుంచి రోడ్డు వేసే ప్రయత్నాన్ని రెవెన్యూశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఇప్పుడు ఏకంగా ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టారు.

సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

రాజాం రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు సమ్మెకు దిగారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ ఇచ్చిన పిలుపు మేరకు రాజాం పురపాలక సంఘ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉద్యోగులు ధర్నాకు దిగారు. సంఘ నాయకులు హరిబాబు, నరసింగరావు, కృష్ణ, అప్పలరాజు, శారద తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, 24,500 ఇవ్వాలని, 15 ఏళ్ల పైబడిన వారిని క్రమబద్ధీకరించాలన్నారు. ఆదివారాలతో పాటు జాతీయ, రాష్ట్ర పండుగలను సెలవులుగా ప్రకటించాలన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన వారికి రూ.5 లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలన్నారు. కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వేతనాలు ఇవ్వకుంటే మట్టితినాలా?

●వినూత్నంగా వేతనదారుల నిరసన



నోటివద్ద మట్టిపెళ్లలు పెట్టుకుని వేతనదారుల నిరసన

శృంగవరపుకోట రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం ఉపాధి హామీ వేతనదారులు శుక్రవారం చెరువు పనులు జరుగుతున్న చోట నోటి దగ్గర మట్టిపెళ్లలు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. వేతనాలు సక్రమంగా ఇవ్వకుంటే మట్టితిని బతికాలా అంటూ పాలకులను వారు ప్రశ్నించారు. వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో వారు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంఘ నాయకుడు గాడి అప్పారావు, సీఐటీయూ నాయకుడు మద్దిల రమణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం వేతనదారులకు పనిచేసిన 15రోజుల్లో వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా నెలలు తరబడి వారికి ఇవ్వకుండా వారికి పస్తులు పెడుతున్నారన్నారు. వెంటనే వేతనదారులకు బకాయిలను చెల్లించాలని కోరారు.

పైనాపిల్ విక్రయించుకోవచ్చు

సీతంపేట రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన రైతులు పండించే సింహాచలం రకానికి చెందిన పైనాపిల్ పంటను రైతుబజార్లలో విక్రయించుకోవచ్చునని పీహెచ్‌వో వెంకటగణేష్ తెలిపారు. దీనికి సంబంధించి వివరాలను ఆయన శుక్రవారం వెల్లడించారు. ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు గిరిజన రైతులు శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న రైతుబజార్లలో పైనాపిల్ పంటను అమ్ముకోవడానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన గిరిజన రైతులు, సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు రైతుబజార్లలో అమ్ముకునేందుకు ఐటీడీఏ ఉద్యానశాఖను సంప్రదించాలనిసూచించారు.

ఆనందసాగర్ గండి పూడ్చివేత

●యువకుడి చొరవతో కదిలిన రైతులు



గండిని పూడ్చుకున్న రైతులు

వేపాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం రెవెన్యూ పరిధిలోని ఆనంద సాగరం చెరువు గండిని ఎట్టకేలకు ఆయకట్టుదారులు పూడ్చుకున్నారు. చెరు వు గండి పూడ్చాలని పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చినా వారు పట్టించు కోలేదు. దీంతో అదే గ్రామానికి చెందిన యువకుడు పరవాడ జగదీశ్ స్పందించారు. శ్రమదానంతో గండి పూడ్చుకుందామని రైతులను సమాయత్తం చేశాడు. తుదకు శుక్రవారం ఆ యువకుడి చొరవతో రైతులు సమష్టిగా చెరువు గండిని పూడ్చు కున్నారు. గండి పూడ్చివేతలో జగదీశ్‌తో పాటు సర్పంచ్ గలారి బంగారయ్య, వర్రి కన్నబాబు, అవగడ్డ సింహాద్రప్పుడు, పోతల సన్యాసినాయుడు, కొరుపోలు తాతబాబు, చొక్కాకుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న నీటి పారుదలశాఖ డీఈఈ శ్రీచరణ్, జేఈ డి.శివరామకృష్ణ ఆనంద సాగరంతో పాటు ఉరిటిలింగాల బంద, గనివాబంద చెరువులను పరిశీలించి సమస్యలను గుర్తించారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్



ప్రయాణికులు వినియోగించుకోలేని బస్ షెల్టర్

విజయనగరం క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ప్రయాణికులకు ఉపయోగపడటం లేదు. తాగుబోతులు, బిచ్చగాళ్లకు ఆవాసంలా మారింది. దాంతో ప్రయాణికులు బస్‌షెల్టర్ వినియోగించడం లేదు. ఆరుబయటే ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తోంది. బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు నగరపాలక సంస్థ అధికారులు చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పడిపోతున్నా పట్టించుకోరా?

● పొలాల్లోకి ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు
● పొంచివున్న ప్రమాదం.. ఆందోళనలో రైతులు
● పట్టించుకోని అధికారులు

వీరఘట్టం, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు పంట పొలాల్లోకి ఒరిగిపోతున్నాయి. ఏ క్షణాన ఇవి నేల కొరుగుతాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని కడకెల్ల, కిమ్మి గ్రామాల్లో పలు విద్యుత్ స్తంభాలు ఇలా పంట పొలాలవైపు ఒరిగి ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి మెత్తబడింది. దీంతో ఈ స్తంభాలు కిందపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.


కడకెల్ల వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభం


కిమ్మి-నడుకూరు మధ్యలో పొలాల్లోకి ఒరుగుతూ..

'జలజీవన్' పనులు పూర్తయ్యేనా?

(5వ పేజీ తరువాయి)


భామినిలో బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన ట్యాంక్ పనులు

పనులు ముందుగా ప్రారంభించి కొంతమేర చేపట్టారు. వంశధార నదీ గర్భంలో రెండు బావులు, నదీ తీరాన 9 మీటర్ల వెడల్పు, 15 మీటర్ల లోతున ఓ బావి పనులు ప్రారంభించారు. ఈ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. నదీ గర్భంలో ఆరుమీటర్ల వెడల్పు, 9 మీటర్ల లోతుగా రెండు బావుల ఏర్పాటుకు పనులు చేపడుతున్నారు. ఈ పనుల్లో లోతుకు వెళ్లేసరికి నదీ గర్భంలో నీటి ప్రవాహం కొనసాగుతుంది. దీనిని అడ్డుకోవడం కష్టతరంగా మారింది. దీనివల్ల ఒక బావి నుంచి మరో బావి లోపల వైపు నుంచి పైపులైన్ అనుసంధానం చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వర్షాకాలానికి ముందే బావి పనులు పూర్తికాకపోతే ఈ ఏడాది పథకం లక్ష్యం చేరుకోవడం గగనమే అవుతుంది. ఇప్పటికే నదిలో బావుల తవ్వకాలు పూర్తి చేసి ఉంటే బాగుండేది. ఒడిశాలో వర్షాలు కురిస్తే నదిలో నీటి ప్రవాహం పెరుగుతుంది. తద్వారా ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోనున్నాయి. పసుకుడి కొండ మీద ఏర్పాటు చేస్తున్న వాటర్ ట్యాంక్ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. 45 వాటర్ ట్యాంక్‌లు నిర్మించాల్సి ఉండగా ఆ పనుల్లో కూడా పురోగతి లేదు. భామిని, ఇసుకగూడ గ్రామాల్లో కేవలం పైపులైన్లు మాత్రమే వేశారు. ఇప్పటికైనా పనులను పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనుల పూర్తికి చర్యలు

వంశధారలో వరదలు రాకముందే నదీ గర్భంలో బావులు, పైపులైన్ల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని 45 వాటర్ ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా, 28 ట్యాంకుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులు పూర్తయ్యాక సింగిడి వద్ద 95 హెచ్‌పీతో కూడిన రెండు మోటార్లను ఏర్పాటు చేసి పసుకుడి కొండపై ఉన్న ట్యాంక్‌కు నీటిని పంపించేందుకు చర్యలు తీసుకుంటాం.

- ఎ.సందీప్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పార్వతీపురం పట్టణంలో తాగునీరు, పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉంటే.. పాలకవర్గ సభ్యులు సమావేశాలను బాయ్‌కట్ చేస్తూ వెళ్లిపోవడం సరికాదన్నారు. అంతేకాకుండా ప్రజాస్వామ్యవ్యవస్థలో అధికార, ప్రతిపక్ష పాలకవర్గ సభ్యులు పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీవీ రమణ, బీవీ రమణ, శ్రీదేవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం జరగాలి

పాలకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం జరగాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం శ్రీకోటదుర్గ మార్కెట్ కళాసీ యూనియన్ పాలకొండ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకొండలో సిమెంట్, ఐరన్, కిరాణా, కాయగూరలు తదితర హోల్‌సేల్ షాపుల్లో పనిచేస్తున్న కార్మికులకు, యాజమాన్యాలకు 2019 సంవత్సరంలో పీస్ రేటు వేతన ఒప్పందం 2022 వరకు అమల్లో ఉండే విధంగా అంగీకారం కుదిరిందని తెలిపారు. అప్పుడు జరిగిన వేతన ఒప్పందం కూడా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా లేదన్నారు. 2022లో నూతన ఒప్పందం జరగాల్సి ఉండగా యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో శ్రీకోటదుర్గ మార్కెట్ కళాసీ యూనియన్ అధ్యక్షుడు జాగ గోవిందరావు, సభ్యులు పాల్గొన్నారు.

సర్క్యులర్‌ను యథావిధిగా అమలు చేయాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎన్ఎంయూ డిపో కార్యదర్శి రాజేష్

పాలకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 1/2019 సర్క్యులర్‌ను యథావిధిగా అమలు చేయాలని ఎన్ఎంయూ డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డిపో గేటు ఎదుట సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్‌పై ఒక్కొక్క డిపోలో ఒక్కొక్క మేనేజర్ ఒక్కోలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సమస్యలను ఎన్ఎంయూ యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఆరు నెలలుగా వివిధ రూపాల్లో తెలిపి ఉద్యమ కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డెలికేట్ మాడుగుల వైకుంఠం, చైర్మన్ ఎం.సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఆర్.మూర్తి, ఎం.రాంబాబు, పీవీ రమణ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం

గరుగుబిల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకర్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిధిలో వైద్యులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పంచాయతీల పరిధిలో సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, తదితర వ్యాధులను అరికట్టేందుకు దృష్టి సారించాలని సూచించారు. కోవిడ్ బారిన పడకుండా అప్రమత్తం చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో కోవిడ్‌పై అవగాహన కల్పించాలన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 24న మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. యోగా శిక్షణకు సచివాలయాల పరిధిలోని కార్యదర్శులు, సిబ్బంది విధిగా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, తహసీల్దార్ పి.బాల, వైద్యాధికారులు ఎస్.సంతోష్‌కుమార్, ఈవోపీఆర్‌డీ సీహెచ్‌వీ కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించడంపై హర్షం

సాలూరు, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ దఫదఫాలుగా చేసిన పోరాటాల ఫలితంగా ఉద్యోగ భద్రత కల్పిస్తూ సర్క్యులర్ అమలు చేయడానికి అంగీకరించిన ఆర్టీసీ యాజమాన్యానికి సాలూరు ఆర్టీసీ డిపో అధ్యక్షుడు పి.సూర్యారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. యూనియన్ చేసిన పోరాటాల ఫలితంగా సర్క్యులర్ విడుదల చేయడం ఎంతో శుభపరిణామం అన్నారు. ఈ విజయంలో అహర్నిశలు శ్రమించి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావుకు, రాష్ట్ర కార్యవర్గానికి కి, జోనల్ నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో ఎన్నో ప్రయోజనాలు

● డీఎంహెచ్‌వో భాస్కరరావు


పార్వతీపురం రూరల్: యోగాసనాలు వేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు, తదితరులు

పార్వతీపురం రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): యోగాతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా అడ్డాపుశీల గ్రామంలో శుక్రవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొని, యోగాసనాలు చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు శీర్షాసనం వేసి అబ్బురపరిచారు. అనంతరం యోగా ప్రయోజనాలపై డీఎంహెచ్‌వో వివరించారు. జూన్ 21 వరకు కొనసాగుతున్న యోగాంధ్ర కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంఎన్‌కే తిరుమల ప్రసాద్, సూపర్‌వైజర్ శ్రీరాములునాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● కురుపాం: యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.


కురుపాం: ఎంపీడీవో కార్యాలయంలో..


పాలకొండ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

సీతానగరం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 27న నుంచి నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో అధికారులందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర అభ్యాసన కార్యక్రమానికి మాస్టర్ ట్రైనీలు హాజరై శిక్షణ ఇస్తారని చెప్పారు. డీటీ ఎ.ఉమామహేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఈనెల 28న యోగా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి నారాయణరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 28న ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొంటారని ఆయన చెప్పారు. ● సీతంపేట రూరల్: యోగాంధ్ర సన్నాహక సమావేశాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి జి.చిన్నబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21నుంచి ప్రారంభమైన యోగాంధ్ర కార్యక్రమం జూన్ 21వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. దీనికిగాను ఏరోజు ఏ కార్యక్రమం చేయాలనే దానిపై మండల స్థాయి సెక్టోరియల్ అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఎంపీడీవో బీబీ మిశ్రో, తహసీల్దార్ పి.అప్పలరాజు, ఎంఈవో ఆనందరావు, సీడీపీవో రంగలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ బి.రామకృష్ణ, వైద్యాధికారి భానుప్రతాప్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాగ్వాదాలు.. వివాదాలు

(5వ పేజీ తరువాయి)

కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పది రోజుల వ్యవధిలో జరగనున్న ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ తదితర అభివృద్ధి పనులకు సంబంధించి అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తే పాలకవర్గ సభ్యులు వాకౌట్ చేయడం సరికాదన్నారు. సుమారు రూ.80లక్షల విలువైన అభివృద్ధి పనులను ఆమోదించాల్సి ఉండగా చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు వాకౌట్‌తో పట్టణ వాసులకు మరిన్ని ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా పట్టణాభివృద్ధిలో వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

చైర్‌పర్సన్ తీరుపై సర్వత్రా విమర్శలు

చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లను శాంతింప జేయడంలో ఆమె విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చైర్‌పర్సన్‌లా కాకుండా ఆమె ఓ వైసీపీ కౌన్సిలర్‌గా వ్యవహరించారని, తన సీటు నుంచి వెళ్లిపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సమావేశాన్ని జరిపించాలని ఎక్స్ అఫీషియో సభ్యుడు, ఎమ్మెల్యే విజయచంద్ర కోరినప్పటికీ ఆమె వినకుండా బయటకు వెళ్లిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బడ్జెట్ ఆమోదం

మునిసిపల్ బడ్జెట్‌ను ఆమోదించినట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. 2025-26కు సంబంధించి ప్రారంభ నిల్వ రూ.28.34 కోట్లు కాగా, ముగింపు నిల్వ రూ.28.43 కోట్లు అని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.16.67 కోట్లు పట్టణాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఇప్పలపోలమ్మ, యర్రకంచ మ్మ, బంగారమ్మ పండుగలను పురస్కరించుకుని తాగునీరు, పారిశుధ్య నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పక్కాగా కార్యచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తామని అన్నారు.

సీపీఎం నాయకుల వినూత్న నిరసన


కోటిపాం బ్రిడ్జిపై ఉన్న గోతిలో స్నానం చేస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకుడు సాంబమూర్తి

జియ్యమ్మవలస, మే 23 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం కోటిపాం వంతెనపై శుక్రవారం సీపీఎం నాయకులు ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. బ్రిడ్జిపై ఉన్న గోతిలో స్నానం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర రహదారి ఉన్న కొమరాడ మండలంలో రోడ్డు అత్యంత దారుణంగా ఉందని, ఎక్కడ చూసినా గోతులతో దర్శనమిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 1వ తేదీలోగా బ్రిడ్జిపై ఉన్న భారీ గోతులను పూడ్చాలని, దీంతో పాటు రోడ్డు పూర్తిగా మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఈ బ్రిడ్జి వద్దే తీవ్ర ఉద్యమం చేస్తామని, ఏది జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రోడ్లను కల్లాలుగా మార్చొద్దు

జియ్యమ్మవలస, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోడ్లను వ్యవసాయ కల్లాలుగా మార్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన గెడ్డతిరువాడ - పెదబుడ్డిడి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి బ్రిడ్జి వద్ద పరిస్థితి చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై వివిధ పంటల నూర్పులు చేయడంతో పాటు రోడ్డు పక్కనే తగులబెడుతున్నారని అన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

టీఏసీ మెంబర్‌గా మాలయ్య

పాలకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడిగా సవర మాలయ్యను కూటమి ప్రభుత్వం నియమించింది. గురువారం దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. సీతంపేట మండలంలో 2001లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మాలయ్య ఎంపీపీగా పనిచేశారు. అప్పటి నుంచి పార్టీ బలోపేతం కోసం నిరంతరం కష్టపడిన మాలయ్యకు కూటమి ప్రభుత్వం గుర్తించి గిరిజన సలహా మండల సభ్యుడిగా అవకాశం కల్పించింది. ఈసందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సాధన సమితి సమావేశం

పాలకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల సాధన సమితి సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు ఆ సంఘ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, నాయకుడు చేబోదుల లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనతో తెలిపారు. పట్టణంలోని ఎలైట్ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో కాలువల ఆయకట్టు రైతులకు ఎదురయ్యే సమస్యలపై చర్చిస్తామన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

సీతానగరం, మే 23 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా పౌర సరఫరాల అధికారిణి, మండల ప్రత్యేకాధికారిణి ఐ.రాజేశ్వరి అన్నారు. మండలంలోని చినభోగిలి, పెదభోగిలి-1, 2 సచివాలయాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె.. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు చేస్తున్న విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మూడు సచివాలయాల్లో డిజిటల్ సహాయకుల కొరత ఎక్కువగా ఉన్నందున సమగ్రమైన సమాచారం లభ్యం కాలేదని తెలిపా రు. ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఐఆర్ఎస్ పిచికారీ

సీతంపేట రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో మొదటి విడత యాంటీ మలేరియా మందు పిచికారీ కొనసాగుతోంది. కిల్లాడ, రూపాయి గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికి ఐఆర్ఎస్ మందును పిచికారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్ ఆయా గ్రామాల గిరిజనులకు సూచించారు. ఈ ప్రక్రియను మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు, సర్పంచ్ ఆరిక సరస్వతి పర్యవేక్షించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

● పాడైన పంపుహౌస్ ట్రాన్స్‌ఫార్మర్


పంప్‌హౌస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు

పాలకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో 3, 4, 5, 6, 7, 8 వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు తెలిపారు. మండలంలోని అంపిలి గ్రామంలో నాగావళి నది వద్ద ఉన్న పంపుహౌస్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడంతో ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈనెల 24న పైన పేర్కొన్న వార్డులకు తాగునీటి సరఫరా ఉండదని ఆయన తెలిపారు. వీలైనంత మేరకు మరమ్మతులు చేయించి శనివారం సాయంత్రానికి తాగునీరు అందిస్తామని చెప్పారు.

న్యూస్ బాక్స్

మహానాడు ఏర్పాట్ల పర్యవేక్షణలో మంత్రి


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఈనెల 27 నుంచి 29 వరకు కడపలో మహానాడు కార్యక్రమం నిర్వహించనున్నది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పట్లను రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల పండుగకు ఎమ్మెల్యే విరాళం


విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, మే 23(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలోని ఎర్రకంచమ్మ, ఇప్పలపోలమ్మ గ్రామదేవతల పండుగకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం తన వంతు విరాళం అందజేశారు. ఇప్పలపోలమ్మ దేవత ఉత్సవ కమిటీకి రూ.2.50లక్షలు, ఎర్రకంచమ్మ దేవత ఉత్సవ కమిటీకి రూ.2.50లక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు జి.రవికుమార్, కోలా మధు, గణేష్ తదితరుల పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి '1912'

సాలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): సాలూరులో విద్యుత్ సమస్య పరిష్కారానికి 1912 నెంబరుకు ఫోన్ చేయాలని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా ఏ వార్డు అయినా ఏ వీధి అయినా నేరుగా 1912 నెంబరుకు ఫోన్ చేయాలని, సంబంధిత శాఖాధికారులు వచ్చి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు.

29న సర్వసభ్య సమావేశం

గరుగుబిల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులంతా విధిగా హాజరుకావాలన్నారు. అలాగే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆమె కోరారు.

బత్తిలి ఎస్ఐగా అప్పారావు

భామిని, మే 23 (ఆంధ్రజ్యోతి): బత్తిలి ఎస్ఐగా అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం క్రైం బ్రాంచి నుంచి ఈయన బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు బత్తిలి ఎస్ఐగా పనిచేస్తున్న అనీల్‌కుమార్ సాలూరు బదిలీపై వెళ్లారు.

విద్య ఆవశ్యకతను తెలుసుకోండి

గరుగుబిల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్య ఆవశ్యకతను ప్రతి ఆడపిల్ల తెలుసుకోవాలని గరుగుబిల్లి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. శుక్రవారం కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను ప్రతి ఆడ పిల్ల తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.